రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సా : 6.32 గం.
సహర్ : మంగళవారం ఉ: 5 గం.




సంగారెడ్డి, మెదక్‌లో పరీక్షా కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

'పది'కి సిద్ధం

నేటి నుంచి వార్షిక పరీక్షలు

- సంగారెడ్డి జిల్లాలో 121 కేంద్రాలు, 22,069 మంది..
- మెదక్ జిల్లాలో 68 సెంటర్లు, 10,300 మంది విద్యార్థులు
- పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు
- ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 17 : పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఈసారి నిమిషం నిబంధన ఎత్తివేశారు. విద్యార్థులను పరీక్ష సమయానికి గంట ముందు నుంచే కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష సమయం దాటిన 5 నిమిషాల వరకు (9.35 గంటల వరకు) కేంద్రాలకు వచ్చిన విద్యార్థులను లోనికి అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించరు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలోని హైదరాబాద్ విద్యాశాఖ కార్యాలయానికి అనుసంధానించారు. ప్రశ్నా పత్రాలను సీసీ కెమెరాల ఎదుటనే తెరవాల్సి ఉంటుంది. పరీక్షల అనంతరం సీల్ చేయడం కూడా కెమెరాల పర్యవేక్షణలోనే పూర్తిచేస్తారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఎస్ఎస్సీ బోర్డు అధికారులు పరీక్షల తీరును నిరంతరం పర్యవేక్షించనున్నారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ఆర్టీసీ బస్‌పాస్ ఉన్నవారు రూట్‌తో సంబంధం లేకుండా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కనిపించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయిస్తారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సందేహాలు ఉంటే కాల్ చేయండి	మెదక్	:90326 25296
	సంగారెడ్డి	:98661 62182

సంగారెడ్డి జిల్లాలో..

పరీక్షల నిర్వహణకు సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 121 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 22,045 మంది రెగ్యులర్, 24 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 11,149 మంది, బాలికలు 10,920 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 121 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 1,331 ఇన్విజిలేటర్లు, 121 సిట్టింగ్ స్క్వాడ్, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు ఇద్దరు, జాయింట్ కస్టోడియన్లు 52 మంది, సి-సెంటర్ కస్టోడియన్లు 13 మందిని నియమించారు. జిల్లా అబ్జార్వర్‌గా మెదక్ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబును నియమించారు. సంగారెడ్డి జిల్లా విద్యార్థులు ఎలాంటి సమస్యలు, సందేహాలున్నా 9866162182 నంబర్‌లో కంట్రోల్‌రూంను సంప్రదించాలని అధికారులు సూచించారు.

మెదక్ జిల్లాలో..

పదో తరగతి పరీక్షలకు మెదక్ జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లావ్యాప్తంగా 68 కేంద్రాలను ఏర్పాటు చేసింది. 10,300 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో.. బాలురు 5,079మంది, బాలికలు 5,221 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు 3 ఫ్లయింగ్ బృందాలు, 19 సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్ బృందాలు, 550 మంది ఇన్విజిలేటర్లు, 68 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 68 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను ఏర్పాటు చేశారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యార్థులు ఏ సమస్య ఉన్నా సమాచారం ఇవ్వడానికి డీఈవో కార్యాలయంలోని కంట్రోల్‌రూంను 9032625296 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలియజేశారు.

హాల్‌టికెట్లు ఇవ్వకపోతే చర్యలు



పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకపోతే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు మనోధైర్యం కల్పించాలి.

-ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి జిల్లా

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి



విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకుని హాల్‌టికెట్ నంబర్ల ప్రకారం సీటింగ్‌ను పరిశీలించుకోవాలి. అరగంట ముందుగానే కేంద్రంలోకి అనుమతిస్తాం. ఎండలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవకుండా తగిన ఏర్పాట్లు చేశాం.

-రాధాకిషన్, డీఈవో, మెదక్ జిల్లా

మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్ బదిలీ

- జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ శ్రీరామ్ నియామకం



మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్

మెదక్ అర్బన్, మార్చి 17: మెదక్ డీఎంహెచ్‌వో డాక్టర్ చందునాయక్ బదిలీ అయ్యారు. ఆయనను ఖమ్మం జిల్లా ప్రోగ్రాం అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యశాఖలో డబ్బులిస్తేనే డిప్యూటేషన్.. రిలీవ్ లెటర్‌లు ఇస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగిని మరో వ్యక్తికి చెప్తున్న ఆడియోలో డాక్టర్ చందునాయక్ పేరును ప్రస్తావించడం వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. తాజాగా ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో డాక్టర్ ధనసరి శ్రీరామ్‌ను మెదక్ జిల్లా వైద్యాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఆయన బాధ్యతలు చేపట్టారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..




సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్ ప్రాంగణంలో మూడురోజుల పాటు జరిగిన 'ఎలాన్-ఎన్‌విజన్' వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం ముగింపు కూడా అంతే ఉత్సాహంగా నిర్వహించారు. మ్యూజిక్ కాంపిటేషన్స్, గేమింగ్, రోబోటిక్స్, రోబోవార్స్, యువర్‌వాయిస్, మూవీ మేకింగ్, ఫిలింఫేర్, ఎలక్ట్రిక్, ఆర్ట్ ఎగ్జిబిషన్, ఫేస్‌పెయింటింగ్, రేడియో ఇవెంట్స్ హంట్ తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. విద్యార్థుల ఆటపాటలతో ప్రాంగణం మార్మోగింది.

-కంది

మెదక్ సీఎస్ఐ చర్చిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మెదక్ కల్చరల్, మార్చి 17: ప్రపంచ ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు మెదక్ మోడరేటర్ కమిషనర్ రైట్ రెవరెండ్ కోడిరెక్కల పద్మారావు శంకుస్థాపన చేశారు. సీఎస్ఐ నిర్మాణం పూర్తిచేసుకుని గత డిసెంబరు 25 నాటికి వందేళ్లలో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మెదక్ మిషన్ కాంపౌండ్‌లో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, బైబిల్‌హౌస్, షాపింగ్‌కాంప్లెక్స్, యాత్రికుల వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిబిటరీ ఇన్‌చార్జి డాక్టర్ శాంతయ్య, మెదక్ డయాసిస్ వైస్ చైర్మన్ విన్‌స్టన్, ట్రెజరర్ విమల్ సుకుమార్, లేసెక్రెటరీ ప్రభు కిరణ్, మినిస్ట్రీయల్ సెక్రెటరీ జయానంద్, ప్రాపర్టీ సెక్రెటరీ సాల్మన్‌రాజ్, మెదక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..!




లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ పథకాలపై పట్టణంలోని వివిధ ప్రాంతాలు, కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలను తొలగించారు. కానీ, మున్సిపల్ కార్యాలయం వద్ద మాత్రం ఇలా వదిలేశారు.

-సంగారెడ్డి రూరల్

సంగారెడ్డి జిల్లాకు

3 కార్పొరేషన్ పదవులు

కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాకు ప్రాధాన్యం

సంగారెడ్డి టౌన్, మార్చి 17: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో సంగారెడ్డి జిల్లాకు ప్రాముఖ్యత దక్కింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాకు మూడు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్‌పర్సన్‌గా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి టి.నిర్మలా జగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పటాన్‌చెరుకు చెందిన ఎంఏ ఫహీం, చిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా జహీరాబాద్‌కు చెందిన గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని మూడు నియోజకవర్గాలకు పదవులు దక్కడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



నిర్మలా జగ్గారెడ్డి

టి.నిర్మలారెడ్డికి కీలక కార్పొరేషన్


తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్‌పర్సన్‌గా టి.నిర్మలా జగ్గారెడ్డి నియామకమయ్యారు. నిర్మలారెడ్డి ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నారు. ప్రభుత్వ హెడ్‌నర్సు ఉద్యోగానికి 2005లో రాజీనామా చేసిన ఆమె 2014లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలుపొందారు. 2022లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. రెండేళ్లుగా సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెను పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించారు.

విధేయతకు పట్టం

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌కు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి, పీసీసీ ప్రొటోకాల్ వైస్‌చైర్మన్ ఎంఏ ఫహీంకు కీలకమైన పదవి దక్కింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసుకున్న బృందంలో సభ్యుడిగా పనిచేసి పేరు తెచ్చుకున్నారు. దీనికి గుర్తింపుగా ఆయనను ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ విద్యార్థి నాయకుడిగా ఎంఏ ఫహీం 2004లో టీఎన్ఎస్ఎఫ్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2006లో టీడీపీలో రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. 2009లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ టికెట్‌పై పోటీచేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2014లో కాంగ్రెస్‌లో చేరి పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా కీలకమైన హోదాల్లో కొనసాగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ కమ్యూనికేషన్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్‌జోడో యాత్ర ఏర్పాట్లలో చురుగ్గా వ్యవహరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి వీరవిధేయుడుగా ఆయనకు పేరున్నది. ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంఏ ఫహీం



ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్‌కు రాష్ట్రస్థాయి పదవి

జహీరాబాద్: కాంగ్రెస్ హయాంలో జహీరాబాద్ ప్రాంతానికి మరోసారి రాష్ట్రస్థాయి పదవి దక్కింది. తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జహీరాబాద్‌కు చెందిన ఎంపీపీ గిరిధర్‌రెడ్డిని నియమించారు. జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లికి చెందిన గిరిధర్‌రెడ్డి 2018-19లో ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా ఎన్నికయ్యారు. అంతకుముందు నుంచే ఆయన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరయ్యారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరించారు. అంతేకాకుండా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్‌శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆయన సమీప బంధువు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన గిరిధర్‌రెడ్డిని ఆదివారం జహీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు.

బడిలో 'అమ్మ' అజమాయిషీ

- మెదక్ జిల్లాలో 897 అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు



(ఫైల్ ఫొటో)

మెదక్ అర్బన్, మార్చి 17: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా కమిటీలకు అప్పగించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం 'అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల' ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటుకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో శనివారం ఉదయమే కమిటీ ఏర్పాటు పూర్తిచేసింది. మెదక్ జిల్లావ్యాప్తంగా 897 అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటయ్యాయి.

కమిటీలు చేపట్టే పనులు

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు పాఠశాలల్లో పలు పనులు చేపట్టనున్నాయి. స్వయం సహాయక బృందాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ కమిటీలు విద్య, పాఠశాల నిర్వహణలో పాలు పంచుకోనున్నాయి. పాఠశాల పర్యవేక్షణ, మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణం-పునరుద్ధరణ, తరగతి గదుల విద్యుదీకరణ, పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లుల తగ్గింపునకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విద్యార్థుల యూనిఫాంల కుట్టుపని తదితర అంశాల ఈ కమిటీలు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామాల్లో గ్రామ సమాఖ్య, పట్టణాల్లో ఏరియా సమాఖ్య అధ్యక్షురాలుగా ఉండగా.. పాఠశాల హెచ్ఎంలు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యుల పదవీ కాలం రెండు సంవత్సరాలు లేదా సభ్యుని పిల్లలు పాఠశాల నుంచి నిష్క్రమించిన తేదీ వరకు ఉంటారు.

ప్రభుత్వ ఆదేశాలతో కమిటీల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించింది. విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు మెదక్ జిల్లాలో 897 అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశాం.

-రాధాకిషన్, డీఈవో, మెదక్

మున్సిపల్ తీర్మానం లేకుండానే నిధులు

● బీజేపీ కౌన్సిలర్ల ఆరోపణ


మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్లు

నర్సాపూర్, మార్చి 17: నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మంజూరైన టీఎఫ్‌ఐడీసీ నిధుల కేటాయింపులు ఇష్టానుసారంగా చేస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ఆదివారం నర్సాపూర్‌లో బీజేపీ కౌన్సిలర్లు రాజేందర్, సురేష్, యాదగిరి, లతారమేష్‌యాదవ్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ. ఇటీవల పట్టణానికి మంజూరైన టీఎఫ్‌ఐడీసీ రూ.30 కోట్లను కౌన్సిల్ తీర్మానం లేకుండానే పలు పనులకు కేటాయించారన్నారు. కౌన్సిలర్లకు సమాచారం లేకుండా నిధులు కేటాయిస్తూ పలు వార్డులకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకుండా వివక్ష చూపుతున్నారన్నారు. టీఎఫ్‌ఐడీసీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


పోచమ్మ ఆలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ప్రవీణ్

సంగారెడ్డి రూరల్, మార్చి 17: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తాళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎంకని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో పోచమ్మ ఆలయం, ముస్లిం మైనార్టీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందాయని, గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ గ్రామాల్లో అభివృద్ధిని పట్టించుకోకుండా బొందలగడ్డలుగా మార్చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదన్నారు. ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, మాజీ సర్పంచ్ ఎంకని లింగం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్‌లో మనోహరాబాద్ క్రీడాకారుల ప్రతిభ

మనోహరాబాద్, మార్చి 17: ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ డోజో కరాటే జిల్లా స్థాయి పోటీలలో మనోహరాబాద్ మండల క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఈ పోటీలు జరిగాయి. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన సుమారు 55 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చూపారు. గెలుపొందిన విద్యార్థులకు సన్ షైన్ షొటోకాన్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ నత్తి మల్లేష్ పతకాలు, సర్టిఫికెట్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం ద్వారా జిల్లాలోని 17 పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ గాజుల మహేష్ కుమార్, కరాటే మాస్టర్ స్వప్న పాల్గొన్నారు.


విజేతలకు సర్టిఫికెట్లను బహూకరిస్తున్న కరాటే క్లబ్ ఫౌండర్ నత్తి మల్లేష్

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

గుమ్మడిదల, మార్చి 17: ఇద్దరు పిల్లలతో సహా తల్లి కనిపించకుండా పోయిన ఘటన గుమ్మడిదల మండలం దోమడుగులో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ నుంచి ఉపాధి కోసం వచ్చి గ్రామంలో నివాసం ఉంటున్న కస్తూరి రామ్‌కు ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు సంతానం. కస్తూరిరామ్ దోమడుగులో షెడ్ వేసుకుని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాడు. అతని మూడో కుమార్తె సంగీత, ఆమె భర్త కాలురాంతోపాటు వారి కూతురు సుందర్(9), కొడుకు ప్రవీణ్(12) కస్తూరి రాంతోపాటే ఉంటూ ఉపాధి పొందుతున్నారు. రెండు నెలల క్రితం సంగీత దంపతుల మధ్య విభేదాల కారణంగా కాలురాం ఆమెను తండ్రి వద్దే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ నెల 16న రాత్రి షెడ్‌లో అందరూ నిద్రిస్తుండగా సంగీత కొడుకు, కూతురుతో కలిసి కనిపించకుండా పోయింది. కస్తూరిరాం నిద్రలేచి చూసేసరికి ఆమె కనిపించకపోవడంతో వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్విమ్మింగ్ 'ఫుల్'

» శిక్షణ.. సేదదీరేందుకు వస్తున్న జనం

» వందల సంఖ్యలో రాక

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 : ఈ వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. ఎండ వేడిమి, ఉక్కపోత నుంచి కాస్తా ఉపశమనం పొందేందుకు ప్రజలు స్విమ్మింగ్‌పూల్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈత నేర్చుకునేందుకు చిన్నా, పెద్ద తేడా లేకుండా స్విమ్మింగ్ పూల్‌కు వస్తున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్‌కు తాకిడి పెరగడంతో సందడిగా మారింది.

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని రాజీవ్ పార్కు సమీపంలో జిల్లా యువజన- క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్‌ను నెలకొల్పారు. ఇక్కడ ఉదయం 6 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఈతకు అనుమతి ఉంటుంది. సాధారణ రోజుల కంటే స్విమ్మింగ్ నేర్చుకునేందుకు ఆదివారం ఎక్కువ మంది వస్తారు. వేసవిలో రోజుకు 50-200 మంది వరకు స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వస్తున్నారు. స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారి కోసం ప్రత్యేకంగా కోచ్‌లను, లైఫ్ గార్డ్స్ అందుబాటులో ఉంచారు. స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారు స్విమ్మింగ్ దుస్తులు వెంట తెచ్చుకోవాలి. రూ.100 నిర్ణీత రుసుము చెల్లించి గంట పాటు స్విమ్మింగ్ నేర్చుకోవచ్చు.

'ఈత' చక్కటి వ్యాయామం

వేసవి కాలంలో స్విమ్మింగ్ చక్కటి ఆరోగ్యాన్నిచ్చే వ్యాయామం, చల్లని నీటిలో పిల్లలు ఆనందంతో పాటు చక్కటి శారీరక దారుఢ్యం సొంతమవుతుంది. నీటిలో ఆత్మరక్షణ కోసం స్విమ్మింగ్ నేర్చుకుంటే బాగుంటుంది. స్విమ్మింగ్ నేర్చుకోవాలనుకునే చిన్నారులు, యువకులు, విద్యార్థులు ఎవరైనా నేరుగా రావచ్చు. స్విమ్మింగ్ నేర్చుకునే క్రమంలో అప్రమత్తంగా ఉండాలి. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పూల్‌కు వచ్చే వారు కాస్ట్యూమ్స్ వెంట తెచ్చుకోవాలి.

రాంచందర్ రావు, డివైఎస్‌వో, సంగారెడ్డి



స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న యువత, చిన్నారులు

నేనంటే.. నేను..!

» పల్లా వర్సెస్ కొమ్మూరి » జనగామలో నిధుల రగడ

» భిన్న ప్రకటనలతో అయోమయం

» పోటాపోటీగా సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల, మార్చి 17: అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతూనే ఉంది. నాడు ఓట్లకోసం పోటాపోటీ విమర్శలు చేసుకోగా, నేడు నిధుల మంజూరు విషయంలో నేనంటే.. నేనని భిన్న ప్రకటనలు చేసుకుంటూ బస్తీ మే సవాల్ అంటుండటంతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం మరోమారు వేడెక్కింది. ఎన్నికల సమయంలో అనూహ్యంగా తెరమీదకు వచ్చిన రెండునెలల్లోనే ఎమ్మెల్యే అయిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో పాగా వేసేందుకు పలు హామీలు గుప్పించారు. ప్రధానంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ఇండస్ట్రియల్ క్యారిడార్‌తో పాటు జనగామ మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లు, చేర్యాల మునిసిపాలిటీల అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేయించానని, ఎన్నికల కోడ్ అనంతరం ఆయా పనులు ప్రారంభించనున్నామని ప్రకటించారు. మరోపక్క అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కూడా పలు హామీలు ఇచ్చారు. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. అయితే, ఎన్నికలలో ఓడిపోయినా.. అక్కడి కాంగ్రెస్ అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా కొనసాగుతారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మరింత యాక్టివ్ అయ్యారు. పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో పల్లా, కొమ్మూరి మధ్య ప్రోటోకాల్ పంచాయతీ నడుస్తున్నది. ఈ నేపథ్యంలో జనగామ మునిసిపాలిటీకి రూ.25 కోట్లు, చేర్యాల మునిసిపాలిటీకి రూ.10 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు సీడీఎఫ్ నిధులు మంజూరు చేయించానని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రకటించి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో పంపించిన ప్రతిపాదనలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదించి, నిధులు మంజూరు చేసిందని, ఎన్నికల కోడ్ వల్ల నిధులు రావడం ఆలస్యమైందని, అయితే.. ఆ నిధులు తాను తీసుకువచ్చానని కొమ్మూరి అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు.



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

పోటాపోటీగా పనులు ప్రారంభం

నియోజకవర్గానికి ఇటీవల నిధులు మంజూరుకావడంతో జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సీసీ రోడ్లు ఇతరత్రా పనులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తున్నారు. మరో పక్క ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయా పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఇలా ఇద్దరు నేతలు పోటాపోటీగా పలును ప్రారంభిస్తుండటంతో కాంట్రాక్టర్లు అయోమయానికి గురవుతున్నారు. పనులు చేపట్టకబోతే ఏం జరుగుతుందోనని, ఒకవేళ చేసినా బిల్లులు వస్తాయా, లేదా అని ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షం.. మామిడి రైతులకు నష్టం

నిజాంపేట, మార్చి 17: అకాల వర్షం మామిడి రైతును దెబ్బతీసింది. శనివారం రాత్రి కురిసిన గాలివానతో మరికొద్ది రోజుల్లో చేతికి వస్తుందనుకున్న మామిడి తోటలో కాయలు రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షానికి నిజాంపేట మండలంలోని పలుచోట్ల మామిడి తోటల్లో కాయలు కింద రాలిపోయాయి.



మామిడి తోటలో రాలిన కాయలు

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

కంగ్టి, మార్చి 17: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పిడుగుపడి ఒకరు మృత్యువాత పడ్డారు. మండలంలోని భీంరా గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కురుమ సిరుగొండ(50) ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులో చింత చెట్టుకు కాయ రాల్చేందుకు కూలీలతో కలిసి వెళ్లాడు. సాయంత్రం గాలి వానకు తోడు ఉరుములు మెరుపులు రావడంతో సిరుగొండ చెట్టుకింద నిలబడి ఉండగా, ఒక్కసారిగా పిడుగు పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నాలుగు దశాబ్దాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

» వెయ్యి మందితో సందడిగా పాఠశాల ప్రాంగణం



చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తూప్రాన్, మార్చి 17: తూప్రాన్ పట్టణంలోని చిల్డ్రన్ హైస్కూల్‌కు చెందిన నాలుగు దశాబ్దాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కనుల పండువగా జరిగింది. పట్టణంలో 1983లో ఏర్పాటైన చిల్డ్రన్స్ హైస్కూల్‌లో 1983 నుంచి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు వెయ్యి మంది ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ హైస్కూల్ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ట్రస్టుతో పేద విద్యార్థులకు సహాయం చేయడం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చేయూతనివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాదం, తదితరులు పాల్గొన్నారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్ఎస్‌లోకి..



జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన నాయకులు



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

నాగల్‌గిద్ద , మార్చి 17: ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో అప్పుడే రాజకీయాలు వేడెక్కాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో వివిధ పార్టీల నాయకులు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన నాగల్‌గిద్ద మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నందుపటేల్, కారముంగి మాజీసర్పంచు రవికుమార్ తమ అనుచరులతో కలిసి శనివారం సాయంత్రం జహీరాబాద్ ఎంపీ, పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఎంపీ బీబీ పాటిల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే ఒక్క రోజు కూడా గడవక ముందే వారు సొంతగూటికి చేరుకున్నారు. ఆదివారం ఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు.

బెల్ట్ షాపులపై దాడి.. మద్యం స్వాధీనం

తూప్రాన్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు ప్రారంభించారు. తూప్రాన్ మండలం యావాపూర్‌లో మద్యం బెల్టు షాపులపై ఆదివారం పోలీసులు దాడులు చేసి, మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. యావాపూర్ గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, నాగరాజులు బెల్టుషాపు ఏర్పాటు చేసిన మద్యం విక్రయిస్తుండగా, దాడి చేశారు. ఈ దాడుల్లో రూ. 20,170ల విలువైన 43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.



యావాపూర్‌లో పట్టుబడిన మద్యం

బీఆర్ఎస్‌కు నాగపురి రాజీనామా

» ఇటీవల జనగామ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు

» తమకు గుర్తింపు ఇవ్వడం లేదని అధిష్టానంపై అసంతృప్తి

» ఎన్నికలకుముందు కాంగ్రెస్‌లో చేరిన తండ్రి రాజలింగం



చేర్యాల, మార్చి 17: మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం తనయుడు నాగపురి కిరణ్‌కుమార్ సొంతగూటికి చేరనున్నారు. ఈమేరకు ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ప్రకటిస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ పంపించారు. ఆయన తండ్రి రాజలింగం కాంగ్రెస్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కొనసాగిన నాగపురి కిరణ్ కుమార్ 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. రాజలింగంకు మరో మారు ఎమ్మెల్సీ ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినా నెరవేర్చకపోవడంతో భవిష్యత్ ఆశలతో కొనసాగారు. ఇదే క్రమంలో నాగపురి కిరణ్‌కుమార్ పలు కార్యక్రమాలు చేపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికలో బీఆర్ఎస్ జనగామ టికెట్ కోసం ప్రయత్నం చేశారు. పార్టీ అవకాశం కల్పించకపోవడంతో ఎన్నికల ముందే నాగపురి రాజలింగం పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి మద్దతు పలికారు. దీంతో మేల్కొన్న బీఆర్ఎస్ రాజలింగం తనయుడు నాగపురి కిరణ్‌కుమార్‌ను బుజ్జగించి, పార్టీ వీడకుండా చూసింది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ పట్టించుకోకపోవడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. తన అనుయాయులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

మునిపల్లి, మార్చి17 : బైక్‌లు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని లింగంపల్లి జాతీయ రహదారి 65పై ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి మునిపల్లి ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుల్బార్గా జిల్లా చించోలి తాలుకా శ్రీనగర్ పెద్ద తండాకు చెందిన పరుశురాం రాథోడ్ - జ్యోతి దంపతులు జహీరాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో లింగంపల్లి గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై మహ్మద్ ఎజాజ్ అనే వ్యక్తి పరశురాం రాథోడ్ నడుపుతున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో జ్యోతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో పరుశరాం రాథోడ్, మహ్మద్ ఎజాజ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతురాలి భర్త పరుశరాం రాథోడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యర్థాల 'వరద'..!

» పారిశ్రామిక వాడల్లో రసాయన ప్రవాహం

» మండువేసవిలో కాలువలై..

» వందల పరిశ్రమలున్నా.. అందుబాటులోని శుద్ధి కేంద్రం

జిన్నారం, మార్చి 17: మండు వేసవిలో నీటి చుక్క దొరకకపోయినా.. మండలంలోని పారిశ్రామికవాడలో రసాయిన వ్యర్థాలు మాత్రం జోరుగా ప్రవహిస్తున్నాయి. ఎండలు దంచి కొడుతుండగా నీటి ప్రవాహాలు మాత్రం దిగువన ఉన్న జలాశయాల్లోకి, దిగువ ప్రాంతాల్లోకి జీవనదుల్లా ప్రవహిస్తున్నాయి. కొన్ని పరిశ్రమల నిర్లక్ష్యం.. వందల పరిశ్రమలున్నా ఒక్క శుద్ధి కేంద్రం(ఈటీపీ) లేకపోవటంతో జిన్నారం మండల పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య జలప్రవాహం సాగుతూనే ఉన్నది.



గడ్డపోతారంలో పీసీబీ ఏర్పాటు చేసిన సంప్‌లో చేరిన వ్యర్థ జలం

జిన్నారం మండలం బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం ప్రాంతాల పలు పరిశ్రమల వ్యర్థా రసాయనాలు దిగువ ప్రాంతాలకు స్వేచ్ఛగా వదిలేస్తున్నారు. ముఖ్యంగా బొల్లారం పరిధిలోని ఆసానికుంట పై భాగంలో పలు రసాయన పరిశ్రమల నుంచి రసాయన జలాలను వదులుతున్నారు. ఆ కలుషిత నీరంతా సమీపంలోని ఆసాని కుంటలో చేరి.. దిగువన ఉన్న ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. గడ్డపోతారం జిల్లెల వాగు పై భాగంలోని కొన్ని పరిశ్రమల నుంచీ కాలుష్య జలాలను వదులుతుండటంతో అవి పీసీబీ ఏర్పాటు చేసిన సంప్‌లోకి చేరుతున్నాయి. ఇక్కడ నిత్యం రెండు ట్యాంకర్ల వరకు వ్యర్థ జలాలను సేకరించి పటాన్‌చెరు శుద్ధి కేంద్రాలకు పంపుతున్నారు.



బొల్లారం పారిశ్రామిక వాడలో వేసవిలోనూ పారుతున్న రసాయన వ్యర్థాలు

శుద్ధి కేంద్రం లేక..

జిన్నారం మండలం పారిశ్రామిక ప్రాంతంగా నాలుగు దశాబ్దాల క్రితం గుర్తింపు పొందింది. అంతేకాకుండా ఇక్కడ అత్యధికంగా రసాయిన పరిశ్రమలే ఉన్నాయి. అందులో నుంచి భారీగా రసాయన వ్యర్థాలు బయటికి విడుదల చేస్తుండటంతో పరిసరాలు కాలుష్య కాసారాలుగా మారుతున్న విషయం అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసిందే. అయినా, ఈ ప్రాంతంలో ఒక్క శుద్ధి కేంద్రం (ఈటీపీ) కూడా లేకపోవటం గమనార్హం. సుమారు 350 పరిశ్రమలకు గానూ 250 వరకు రసాయన ఉత్పాదనలు చేసే పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. నిత్యం వందల ట్యాంకర్ల జల, ఘన వ్యర్థాలు వెలువడుతుండగా స్థానికంగా శుద్ధి కేంద్రం లేక జేఈటీఎల్ జీడిమెట్ల, పీఈటీఎల్ పటాన్‌చెరు ప్రాంతాలకు వీటిని తరలించాల్సి ఉంటుంది. ఘన వ్యర్థాలను దుండిగల్ రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేస్తున్నారు. కాగా పారిశ్రామిక వాడలకు ఆయా శుద్ధి కేంద్రాలు దూరంగా ఉండటంతో అంతదూరం వ్యర్థ జలాలను తరలించడం ఖర్చుతో కూడిన వ్యవహారంగా భావిస్తున్నారు. దీంతో కొన్ని పరిశ్రమల వారు ట్యాంకర్లలో వ్యర్థాలను తరలించి, బహిరంగ ప్రదేశాలు, జలాశయాలు, అటవీ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. తాజాగా, ఈ నెల 14న రాత్రివేళ గడ్డపోతారం పారిశ్రామిక వాడ నుంచి ట్యాంకర్‌లో కాలుష్య జలాలు తరలించి, మేడ్చల్ జిల్లాలో డంప్ చేస్తుండగా, పీసీబీ అధికారులు పట్టుకున్నారు. మండలంలో శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ సమస్యను చాలా వరకు నివారించవచ్చునని, మండలాన్ని కాలుష్యం బారిన కాపాడవచ్చునని స్థానికులు భావిస్తున్నారు.


కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్

నిజాంపేటలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

నిజాంపేట, మార్చి 17: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడంతో పాటు ప్రజల్లో శాంతిభద్రతల పట్ల భరోసా నింపడమే ఫ్లాగ్‌మార్చ్ ముఖ్య ఉద్దేశమని సీఐ వెంకటేశ్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు కల్వకుంట గ్రామంలో ఆదివారం రామాయంపేట సీఐ వెంకటేశ్ కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణ కల్పించడమే ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఓటర్లు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్టులను ప్రారంభించిన డీఎస్పీ


పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ

నాగల్‌గిద్ద, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తెలంగాణ కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మండల పరిధిలోని మోర్గి, కరస్‌గుత్తి గ్రామాల సమీపంలో పోలీస్‌చెక్‌పోస్ట్ కేంద్రాలను నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద ఎస్‌ఐ సిద్దిరాములు, ఏఎస్‌ఐఅంజిరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఖేడ్ డిపో నుంచి కనుమరుగవుతున్న సూపర్‌లగ్జరీలు

● పదేళ్లలో 72 నుంచి 52కు తగ్గిన బస్సులు ● ఆదాయం లేదనే నెపంతో తరలిస్తుండటంపై స్థానికుల్లో అసంతృప్తి

నారాయణఖేడ్, మార్చి 17: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో సూపర్ లగ్జరీ బస్సులు కనుమరుగు కానున్నాయి. జిల్లాలోనే మారుమూలప్రాంతంలో ఉన్ననారాయణఖేడ్ డిపోలో పది సంవత్సరాల క్రితం 72 బస్సులు ఉంటే, ప్రస్తుతం ఆర్టీసీకి సంబంధించి కేవలం 52 బస్సులు మాత్రమే ఉండగా, అద్దె బస్సులు 14 ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా నారాయణఖేడ్ డిపోలో సూపర్‌లగ్జరీ బస్సులు వాడుకలో ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆదాయం అంతంతమాత్రంగా వస్తుందనే నెపంతో ఖేడ్ నుంచి ఇతర డిపోలకు తరలిస్తున్నారు. నారాయణఖేడ్ నుంచి మొదట్లో గుంటూరుకు ప్రతిరోజూ మూడు బస్సులు నడిపేవారు. కోవిడ్ అనంతరం గుంటూరు బస్సులను తొలగించి చీరాలకు నడిపారు. గత ఏడాది రెండు బస్సులను ఇతర డిపోలకు తరలించగా, తాజాగా గత శుక్రవారం టీఎస్15జెడ్0219 బస్సును బీహెచ్ఈఎల్ డిపోకు తరలించారు. మరో బస్సును కూడా తరలించనున్నట్లు సమాచారం. దీంతో ఖేడ్ డిపోలో సూపర్ లగ్జరీ బస్సుల సంఖ్య 6 నుంచి 2కు తగ్గిపోనున్నది. రెండు దశాబ్దాలుగా ఖేడ్ డిపోలో కొనసాగిన సూపర్‌లగ్జరీ బస్సులను ఆర్టీసీ అధికారులు ఇతర డిపోలకు తరలించడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నడుపుతున్న సమయంలో ఆదాయం రాకుంటే బస్సు సమయాన్ని, రూట్‌ను మార్చి ఖేడ్ నుంచి ఇతర ప్రాంతాలకు నడిపి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటే స్థానికులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. ఏదైనప్పటికీ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఖేడ్ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులను ఇతర డిపోలకు బదిలీ చేస్తుండడంతో, ఖేడ్‌లో సూపర్ లగ్జరీ బస్సులు కనుమరుగు కానున్నాయి.


ఇటీవల బీహెచ్ఎల్ డిపోకు తరలిన సూపర్‌లగ్జరీ బస్సు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

సూపర్ లగ్జరీ బస్సులకు ఆదాయం ఆశించినంతగా రావడంలేదు. అంతంత మాత్రంగానే ఆదాయం రావడంతో సూపర్ లగ్జరీ బస్సులను ఉన్నతాధికారులు ఇతర డిపోలకు తరలిస్తున్నారు. వారి ఆదేశాల మేరకే వాటిని ఇతర డిపోలకు పంపించాం. వాటి స్థానంలో ఖేడ్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు రానున్నాయి.

- మల్లేశయ్య, డీఎం, ఖేడ్ డిపో

మద్యానికి బానిసైన వ్యక్తి బలవన్మరణం


అత్మహత్య చేసుకున్న కిరణ్

కౌడిపల్లి, మార్చి 17: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణం చెందిన సంఘటన మండలకేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడ్డంల సత్యమ్మ భర్త నర్సింహులు 15 ఏళ్ల క్రితం మృతి చెందగా, ఆమె ఇద్దరు కుమారులు. సత్యమ్మ తన తల్లిగారి ఇల్లు అయిన జగ్గంపేటలో ఉండగా శనివారం రాత్రి ఆమె పెద్ద కుమారుడు కిరణ్(21) రూ. 20వేలు ఇవ్వాలని అడిగాడు. తమ వద్ద అంత డబ్బు లేదని చెప్పి వారం రోజుల క్రితం చెవి కమ్మలు కుదువ పెట్టి రూ.17,500 ఇచ్చింది. ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని కొడుకుకు తెలిపింది. దీంతో మద్యం తాగేందుకు డబ్బులు లేవని అలిగిన కిరణ్ ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

హామీలు నెరవేర్చని బీజేపీని ఓడించండి: సీపీఐ

నారాయణఖేడ్, మార్చి 17: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఓడించి బుద్ధిచెప్పాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్ పేర్కొన్నారు. ఖేడ్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పేద, మధ్యతరగతి, దళితులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. నల్లధనం వెలికి తీస్తానని, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రజలను మోసం చేశారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేసి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థికి తాము మద్దతు ఇచ్చి గెలిపిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి, అజర్, షైబు, అశోక్, ఇసాక్, ప్రేమ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మార్డిలో సామూహిక కుంకుమార్చన


లలితా సహస్ర పారాయణం, కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కల్హేర్, మార్చి 17: మండల పరిధిలోని మార్డి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సామూహిక లలితా సహస్ర పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంజీవులు మహరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆరు రోజులుగా ఆలయ ఆవరణలోనే నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో కూడా భజనలు, కీర్తనలు కొనసాగాయి. హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం

జిన్నారం, మార్చి 17: జిన్నారం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెంలో మల్లన్నస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్న ఆలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఒగ్గు కథ, జాతరను ఘనంగా నిర్వహించారు.

ఏఎంసీ వైస్‌ను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం


ఏఎంసీ వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం

సదాశివపేట, మార్చి 17:పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ గుప్తా ఆధ్వర్యంలో సుహాసిని కుమారి పూజ వ్రత కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీమాతకు అభిషేకం, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ బాధ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు నూతనంగా ఎన్నికైన ఏఎంసీ వైస్ కంది కృష్ణగుప్తాను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

మల్కాపూర్‌లో 405వ వారం స్వచ్ఛభారత్


మల్కాపూర్‌లో శ్రమదానంలో పాల్గొన్న గ్రామస్థులు

తూప్రాన్, మార్చి 17: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 405వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మెక్ ఇన్ మల్కాపూర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో చీపుర్లతో ఊడ్చి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, నేచర్ ఐకాన్ యువత, గ్రామా పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపల్లిలో 6వ వారం స్వచ్ఛ భారత్

మనోహరాబాద్, మార్చి 17: మండలంలోని జీడిపల్లి గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం 6వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. నేచర్ ఐకాన్ యువకులు గ్రామంలో రోడ్లపై చెత్తను తొలగించారు.

కొల్చారం మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా యాదగిరి

కొల్చారం, మార్చి 17: మండల గ్రామీణ వైద్య సంఘం అధ్యక్షుడిగా చింతల యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కొల్చారంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చౌదరి రాము, కార్యదర్శిగా స్వామిగౌడ్, కోశాధికారిగా గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

ఇరిగిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సంగారెడ్డి రూరల్, మార్చి 17: సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామంలో రూ.15 లక్షల నిధులతో రెండు ఫార్మేషన్, గ్రావెల్ సీసీ రోడ్డుకు ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి మండల అధ్యక్షుడు బుచ్చిరాములు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సాగర్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ జీరో బిల్లు అందించాలి

సంగారెడ్డి రూరల్, మార్చి 17: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటు అందిస్తామని చెప్పినా అమలు కావడం లేదని సీపీఎం నాయకుడు కృష్ణ విమర్శించారు. సంగారెడ్డి పట్టణం, మండలం కులబ్‌గూర్ గ్రామంలో జీరో బిల్లు రాని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించి ఆయన మాట్లాడారు. గృహజ్యోతి పథకానికి ప్రజాపాలనలో విద్యుత్‌శాఖ అధికారుల తప్పిదాల వల్లే పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా అనేక మందికి జీరో బిల్లులు రాలేదని ఆరోపించారు. జీరో బిల్లు రానివారు ప్రజాపాలన కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లినా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, మీరు అనర్హులని కేంద్రంలోని సిబ్బంది తెలపడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారన్నారు. అర్హులైన వారందరికీ జీరో బిల్లు రాక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారని, అర్హులైన వారందరికి జీరో బిల్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అధ్యయనం అత్యవసరం


కేవీకేలో సేంద్రీయ ఎరువుల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జహీరాబాద్, మార్చి 17: విద్యార్థులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి పట్టును పెంచుకోవడం అత్యవసరమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వరప్రసాద్, స్నేహలత, శైలజ, రమేష్‌స్వామి, శ్రీకాంత్, వ్యవసాయశాఖ విస్తరణాధికారి ప్రదీప్ తదితరులు పేర్కొన్నారు. గ్రామీణ ఉద్యానవన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కేవీకేలో సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతు జీవామృతం, వర్మీ కంపోస్టు ఎరువులు, కషాయాల తయారీ, తేనేటీగల పెంపకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యార్థిదశలో ఎంత నేర్చుకున్నా తక్కువేనని వివరించారు. విద్యార్థులు నేర్చుకున్న ప్రతీ విషయం భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కేవీకే సమీపంలో సాగవుతున్న జీడిమామిడి తోటను విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: సురేష్‌కుమార్ షెట్కార్


న్యాల్‌కల్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

జహీరాబాద్, మార్చి 17: కాంగ్రెస్‌తోనే అభివద్ధి సాధ్యమవుతుందని మాజీమంత్రి డా.చంద్రశేఖర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిన నేపథ్యంలో లింగాయత్ సమాజ్ నాయకులు ఆదివారం పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్‌హాల్‌లో వారికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కూడా కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. లింగాయత్‌ల అభ్యున్నతికి కార్పొరేషన్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం లింగాయత్ సమాజ్ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముల్తానీ పాటిల్, ఝరాసంగం, కోహీర్, జహీరాబాద్ మండలాలకు చెందిన పార్టీ మండలాధ్యక్షులు హన్మంతరావుపాటీల్, రాంలింగారెడ్డి, నర్సింహారెడ్డి, మక్సూద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరిక

న్యాల్‌కల్, మార్చి 17: మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో ఆదివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. న్యాల్‌కల్‌లోని చర్చిలో క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం న్యాల్‌కల్‌లోని బసవేశ్వర ఆలయంలో లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాల్‌కల్ మండల వైస్ ఎంపీపీ మహ్మద్ గౌసొద్దీన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రఫీయొద్దీన్, న్యాల్‌కల్‌కు చెందిన గౌలి రాజు, వడ్డీ గ్రామానికి చెందిన వడ్డీ రవి ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితోపాటు సుమారు 200మంది కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, మాజీమంత్రి చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, యువనాయకులు బొల్లి శ్రీనివాస్, జక్కుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


కోహీర్: దిగ్వాల్ జడ్పీహెచ్ఎస్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నర్సాపూర్, మార్చి 17: పదోతరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానుండటంతో మండలంలో సజావుగా సాగేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం ఎంఈవో బుచ్యానాయక్ పరీక్షలకు సంబంధించి మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో ఆరు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల, బాలుర పాఠశాల, విజేత, డాన్‌బాస్కో, విష్ణు పాఠశాలలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 976 మంది పరీక్షలకు హాజరుకానున్నారని అందులో 495 బాలురు 481 బాలికలు ఉన్నారని తెలిపారు. పరీక్షలకు విద్యార్థులు గంట ముందు హాజరుకావాలన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై 12.30గంటల వరకు ఉంటుందన్నారు.

● **శివ్వంపేట:** శివ్వంపేటలో నాల్గు కేంద్రాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో బుచ్యానాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల శివ్వంపేట, చండి, గోమారం, దొంతి పాఠశాలలో కేంద్రాలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 499 మంది విద్యార్థులకు గానూ 269 బాలురు, 230 బాలికలు ఉన్నట్లు తెలిపారు.

● **కల్హేర్/సిర్గాపూర్:** కల్హేర్, సిర్గాపూర్ మండలాల పరిధిలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాధికారి శంకర్ ఆదివారం తెలిపారు. కల్హేర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పరీక్షా కేంద్రంలో 5 పాఠశాలలకు చెందిన 101 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 8 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పరీక్షా కేంద్రంలో మూడు పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 12 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ ఉన్నత పాఠశాలలో మూడు పాఠశాలలకు చెందిన 170 విద్యార్థులు పరీక్షలు రాయనుండగా ఇక్కడ 12 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

● **కోహీర్:** మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శంకర్ పేర్కొన్నారు. మండలంలో మొత్తం 590 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కోహీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 180 మంది, విశ్వభారతి ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 106 మంది, దిగ్వాల్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో 304మంది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

● **రేగోడు:** పదో తరగతి పరీక్షల నిర్వహణకు రేగోడు మోడల్ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని జగిర్యాల, టి లింగంపల్లి, గజవాడ, రేగోడు ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ పాఠశాల, కస్తూర్బా విద్యాలయం నుంచి 179 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని మండల విద్యాశాఖ సిబ్బంది తెలిపారు. పదవ తరగతి పరీక్షల సమయంలో జిరాక్స్ కేంద్రాలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయాలని ఆదేశించినట్లు ఎస్ఐ రాజయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు.

డిప్యూటేషన్ పై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బదిలీ

జిన్నారం, మార్చి 17: బొల్లారం మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ డిప్యూటేషన్‌పై ఎస్ఈఆర్‌టీకి బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో పాఠశాల పీజీటీ ఉపాధ్యాయులు బాలకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని బొల్లారం మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజను రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థకు రెండేళ్ల కాలపరిమితితో బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాలకృష్ణకు బాధ్యతలను అప్పగిస్తూ మోడల్ పాఠశాలల రాష్ట్ర అదనపు డైరెక్టర్ శ్రీనివాస్‌చారి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు

నిజాంపేట, మార్చి 17: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకై చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఆదివారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున గ్రామంలోని రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్, జెండాలను తొలగించామని, అలాగే గోడల మీద ఉన్న వాల్ పెయింటింగ్‌పై సున్నం వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేష్ గౌడ్


రమేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రఘునందన్‌రావు

నర్సాపూర్, మార్చి 17: బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సాపూర్‌కు చెందిన పి.చిన్నరమేష్‌గౌడ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా ఓబీసీ మోర్చాను జిల్లాలో మరింత పటిష్టపరిచి గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయడానికి అహర్నిషలు కృషి చేస్తానన్నారు. కాగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యాక మర్యాద పూర్వకంగా మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావును కలువగా ఆయన రమేష్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. తనకు పదవీ రావడానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్రఅధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌లకు రమేష్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖులకు పెద్దమ్మ జాతర ఆహ్వానం


ఆహ్వాన పత్రిక ఇస్తున్న ముదిరాజ్ పెద్దలు

రామాయంపేట, మార్చి 17: ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలను ఆదివారం మండలకేంద్రంలో విడుదల చేశారు. అనంతరం స్థానిక రాజకీయ ప్రముఖులకు ఆహ్వానం పలికారు. పట్టణంలోని కామారెడ్డి రహదారిలో గుట్టల మధ్య వెలసిన పెద్దమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఇప్పుడు ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ నెల 27 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వేడుకలు సాగుతాయి.

నారాయణఖేడ్‌లో తేలికపాటి వర్షం



నారాయణఖేడ్, మార్చి 17: నారాయణఖేడ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు నుంచి కొద్దిపాటి వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత అధికమైనప్పటికీ, వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటేలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

నర్సాపూర్, మార్చి 17: ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కరాటే మాస్టర్ గుర్రాల అశోక్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ చూపినవారికి ఆయన సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కరాటేలో శిక్షణ పొందాలనే ఉద్దేశంతో తాము శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు నగేష్, నవీన్, దినకర్, ప్రసన్న, భూపాల్ తదితరులు పాల్గొనగా 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కాంగ్రెస్‌లోకి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్!

నర్సాపూర్, మార్చి 17: నర్సాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హబీబ్‌ఖాన్ తన అనుచరవర్గంతో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన అనుచరులు ఇచ్చిన సమాచారం మేరకు.. కొన్ని రోజులుగా బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న హబీబ్‌ఖాన్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్యనాయకులతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిసింది. త్వరలోనే రాష్ట్రస్థాయిలో ముఖ్యనేతల సమయం తీసుకుని పార్టీలో చేరడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వీరితో పాటు నియోజకవర్గంలోని పలువురు మాజీ సర్పంచులు, ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీటీసీలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి


పాడే మోస్తున్న గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

నిజాంపేట, మార్చి 17: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఓ నిండు ప్రాణం బలైందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన బక్కోళ్ల బాలమల్లు వ్యవసాయ పొలం వద్ద ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆదివారం బాలమల్లు అంత్యక్రియల్లో శ్రీహరి యాదవ్ పాల్గొని పాడే మోశాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చాడు. ఆయన వెంట జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవరాజు యాదవ్, యాదవ సంఘం నాయకులు పాగాల నగేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రాజయ్య యాదవ్, బట్టు మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నూతన వధువులకు పుస్తెమట్టెలను అందజేసిన బీజేపీ నాయకులు

కొల్చారం, మార్చి 17: కొల్చారం మండల పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన నూతన వధువులకు ఆదివారం బీజేపీ నాయకులు పుస్తె మట్టెలను అందజేశారు. నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రఘువీరారెడ్డి సహకారంతో మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన నెల్లి బాలమణి, మల్లేశం దంపతుల కుమార్తె కీర్తన, అప్పాజిపల్లి గ్రామానికి చెందిన చింతల అనిత, నర్సింహులు దంపతుల కుమార్తె వర్షిత, ఎనగండ్ల గ్రామానికి చెందిన చాకలి ఏషోబు, శ్రీమతి స్వరూప పుత్రిక అనిత వివాహాలకు ఆదివారం పుస్తె మట్టెలను మండల బీజేపీ అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు వడ్ల చంద్రశేఖర్, బూత్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, రంగాగౌడ్, లింగం, శివ, సత్యం, బాగేష తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలల్లో విద్యార్థులు సత్తా చాటాలి

జిన్నారం, మార్చి 17: పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ చూపాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి పేర్కొన్నారు. ఆదివారం బొల్లారంలో పీఎస్ఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్షా సామగ్రి అందజేశారు. పరీక్షలలో విద్యార్థులు సత్తా చాటాలని భవిష్యత్‌లో విద్యారంగంలో రాణించాలని రోజారాణి సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.